క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావును కలిసిన నాగరాజు



జనగామ: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బక్క నాగరాజు బుధవారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జనగామ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి తీసుకు రావాలని మంత్రి చెప్పినట్లు తెలిపారు. పల్లా గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు.

ఘనంగా రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



జనగామ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జనగామ కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నిరంతరం ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. నర్సింగరావు, కరుణాకర్ రెడ్డి, రవి యాదవ్, శివరాజ్ యాదవ్, నర్సిరెడ్డి, మహేందర్, శేఖర్, లక్ష్మణ్, అనిల్, ప్రవీణ్, నిఖిల్, అరవింద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి, నల్లగోని బాలకిషన్‌గౌడ్, నాయకులు గౌస్, మోహిన్‌రెడ్డి, దిడ్డిగ రమేష్, సత్తయ్య, మల్లయ్య, ఐలుమల్లయ్య, శ్రీనివాస్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, బుచ్చిరాజు, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

నైపుణ్యతకు అంగవైకల్యం అడ్డురాదు

దేవరుప్పుల: నచ్చిన రంగంలో నైపుణ్యత సాధించేందుకు అంగవైకల్యం అడ్డురాదని ప్రిన్సిపాల్ రాపోలు ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాలకుర్తికి చెందిన అంధ కళాకారుడు శంకరాచారి పాటలు, ఫ్లూట్, క్యాషియో ప్రదర్శన ఇచ్చి తన ప్రతిభ వ్యక్తం చేశారు. శంకరాచారి ప్రదర్శనకు ముగ్ధులైన జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) విద్యార్థులు,అధ్యాపక బృందం కలిసి అంధకళాకారుడికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.అరుణాకర్, భాస్కర్, రాధిక, చైతన్య హరితకుమారి, రహీమున్నీసా పాల్గొన్నారు.

నియామకం

చిల్పూరు: మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన తాళ్లపల్లి జగన్నాథంను నియమించినట్లు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దం రాజు ప్రకటించారు. ఈ సందర్భంగా చిన్నపెండ్యాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్నాథం మాట్లాడుతూ మండల అధ్యక్ష పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. సంఘం అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు కోఆర్డినేటర్ జనగాం యాదగిరి, మాజీ సర్పంచ్‌లు తాళ్లపల్లి సమ్మయ్య, వెంకటయ్య, మొగిలి, ఎల్లయ్య, ధర్మయ్య, స్వరాజ్, గంగరాజు, సంపత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు.. జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, సర్పంచ్ మందపురి మల్లేషం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా, వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పోటాపోటీ ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల సమయం దగ్గరపడుతున్నా కొద్దీ పార్టీ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గంలో కలియ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రజలకు పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిర మండలంలోని కుర్చపల్లి, అయ్యవారిగూడెం, దాసన్నగూడెం, కోమళ్ల, గోవర్ధనగిరిలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆమె కోరారు. మాజీ మంత్రి, బీజేపీ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గుండె విజయ రామారావు ఘన్‌పూర్ మండలంలోని ఇప్పగూడెంలో, జనగామ నియోజకవర్గ ఇండియా ప్రజా బంధు ఎమ్మెల్యే అభ్యర్థి గంధమల్ల ఇస్తారి బచ్చన్నపేట మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.

'సాక్షి మ్యాథ్స్‌బీ'కి విశేష స్పందన



ఏకశిలలో ప్రశ్నపత్రాలను ఓపెన్ చేస్తున్న ఉపేందర్



ఒయాసిస్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం : విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలో నిర్వహించిన మ్యాథ్స్‌బీ ప్రాథమిక స్థాయి పరీక్షకు విశేష స్పందన లభించింది. జనగామ పట్టణం హైదరాబాద్ రోడ్డులోని ఏకశిల పబ్లిక్ స్కూల్, సాన్ మారియా, గీతాంజలి, శ్రీ అరబిందో, లింగాలఘణపురం మండలం పీవీఆర్ స్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్ కేంద్రంలోని ఒయాసిస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన రాత పరీక్షకు 500కు పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు చిర్ర ఉపేందర్‌రెడ్డి, ఇ.ప్రభాకర్‌రెడ్డి, పి.సతీష్‌రెడ్డి, పి.వెంకట్‌రెడ్డి, వివేకానందరావు, జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్, డీఎస్సీ, టెట్, మెడిసిన్ ఇలా అనేక పోటీ పరీక్షలకు సంబంధించి గణితం, ఇతర నాలెడ్జ్‌పై పట్టు పెరుగుతుందని చెప్పారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో 'సాక్షి' ఎప్పుడూ ముందంజలో ఉంటుందని అభినందించారు. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు 9505514424 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

విజ్ఞానం పెరుగుతుంది



సాక్షి మ్యాథ్స్ బీ పరీక్షలతో విజ్ఞానం పెరుగుతుంది. పోటీ పరీక్షల్లో ఎలా పాల్గొనాలనే విషయం హైస్కూల్ స్థాయిలోనే అవగాహన కలుగుతుంది. ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహించాలి.

\- గుండా అశీశ్, 7వ తరగతి, ఏకశిల పబ్లిక్ హైస్కూల్

ప్రతి అంశంపై పట్టు లభిస్తుంది



ఈ పరీక్ష ద్వారా కొత్త విషయాలను తెలుసుకున్నాను. ప్రతి అంశంపై అవగాహన కలిగింది. భవిష్యత్‌లో ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు మ్యాథ్స్ బీ ఎంతగానో దోహదపడుతుంది.

\- బి.సంజన, 9వ తరగతి, ఏకశిల పబ్లిక్ స్కూల్

సమయం ఆదా చేయడం తెలిసింది



మ్యాథ్స్ బీ పరీక్షలో పాల్గొనడం ద్వారా సమయం ఎలా ఆదా చేసుకోవాలనే విషయం తెలిసింది. ఈ పరీక్షతో తక్కువ సమయంలో ఎక్కువ సమాధానాలు ఎలా రాయలో ట్రిక్ తెలిసిపోయింది.

\- జె.అనీష్, శ్రీ అరబిందో స్కూల్

ఉన్నత చదువులకు ఉపయోగకరం



ఈ రాత పరీక్ష భవిష్యత్‌లో ఉన్నత చదువులకు గణిత విద్యకు ఒక వారధిగా ఉపయోగపడుతుంది. సబ్జెక్టు మరింత సులువుగా అర్థం చేసుకునేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

\- కె.శ్రీహాన్ష్, 4వ తరగతి, గీతాంజలిస్కూల్

మరిన్ని పరీక్షలు నిర్వహించాలి



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్ష భవిష్యత్ పోటీ పరీక్షలకు ఎంతగానో దోహదపడుతుంది. ఈ పరీక్ష కోసం కష్టపడి ప్రిపేర్ అయ్యాను. ఇలాంటి పోటీ పరీక్షలు మరిన్ని నిర్వహించాలి.

\- సంజన, 7వ తరగతి, సాన్‌మారియా స్కూల్

మల్టిపుల్ చాయిస్ ఇదే ప్రథమం



మ్యాథ్స్‌బీ పరీక్ష రాయడం భవిష్యత్ పోటీ పరీక్షలపై ఆసక్తి పెరిగింది. కేవలం ప్రశ్నలకు నేరుగా సమాధానాలు రాసే పరీక్షలు కాకుండా ఇలా మల్టిపుల్ చాయిస్‌లో రాయడం ఇదే ప్రథమం.

\- కె.సృజన, విద్యార్థి, ఒయాసిస్ స్కూల్

మ్యాథ్స్‌పై పట్టు వచ్చింది



మ్యాథ్స్‌బీ పరీక్షలో పాల్గొనడం వల్ల సబ్జెక్టుపై పట్టు వచ్చింది. ఉన్నత విద్యకు సంబంధించిన పోటీ పరీక్షల్లో ఎలాంటి భయం లేకుండా పాల్గొనడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

\- పి.యశస్విని, 8వ తరగతి, పీవీఆర్ స్కూల్

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



చేర్యాల ప్రచారంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- చేర్యాల మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం

చేర్యాల(సిద్దిపేట): అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు, బతుకమ్మలు, కోలాటాలతో ఘన స్వాగతం పలకగా.. పల్లా గడిచిన పదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పాటు మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని, అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. చేర్యాలకు తెలంగాణ సాయుధ పోరాటం నుంచి రాష్ట్రసాధన ఉద్యమం వరకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పట్టణ అభివృద్ధి సీఎం కేసీఆర్.. సుందరీకరణ బాధ్యత తనదేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 10 కోట్ల నిధులు ఇచ్చిందని.. సరిపోకుంటే మరిన్ని నిధులు తెస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికలు అయిపోగానే నెల రోజుల్లో కొత్త పింఛన్లు మంజూరు చేయిస్తానన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా మరో 7 వేల ఇళ్లు తెచ్చి అర్హులందరికీ అందజేస్తానని పేర్కొన్నారు. ఇప్పటికే సీడీపీ నుంచి రూ. 50 లక్షలతో రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం జరుగుతుందన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశం ఇటీవల జనగామ సభలో సీఎం ప్రకటించిన విషయం గుర్తు చేశారు. చేర్యాలకు ఈనెల 18వ తేదీన సీఎం కేసీఆర్ వస్తున్నారని, పట్టణ అభివృద్ధికి సరిపడా నిధులు అడిగి తీసుకుందామన్నారు.

అభివృద్ధిలో పోటీ పడాలి

లోకల్, నాన్‌లోకల్ అని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడాలని సవాల్ విసిరారు. పట్టణకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. తాను జనగామ జిల్లా బిడ్డనే అని.. లోకల్, నాన్ లోకల్ అని ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

మద్దూరు మండల పరిధిలోని వంగపల్లి శివారు ఉప్పరోనిగడ్డకి చెందిన 30 మంది కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, రాష్ట్ర నాయకుడు జల్లి సిద్దయ్య, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్, రైతు బంధు మండల కో–ఆర్డినేటర్ రంజిత, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, మాజీ సర్పంచ్ ముస్త్యాల ఆరుణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ఓటు వేయండి



జనగామలో బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పల్లా సతీమణి నీలిమ

జనగామ: తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓటు వేయాలని జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ అన్నారు. పట్టణంలోని 30,19, 26, 2 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కౌన్సిలర్లు బండ పద్మ, బొట్ల శ్రీనివాస్, వాంకు డోతు అనిత, కర్రె శ్రీనివాస్, గజ్జెల నర్సిరెడ్డి, దేవరాయ నాగరాజు, తిప్పారపు విజయ్, రాజు, బిజ్జాల నవీన్‌గుప్తా, ఉడుగుల నర్సింహులు, చెంచారపు పల్లవి, తదితరులతో కలిసి ఆమె బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. అంతకు ముందు 2వ వార్డులో చైర్‌పర్సన్ జమున పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కాగా నీలిమ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

గోదావరి జలాలు కేసీఆర్ చలువే

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గానికి గోదావరి జలాలు రావడం సీఎం కేసీఆర్ చలువేనని మండలంలోని పోచన్నపేట ఎంపీటీసీ మామిడి అరుణవలయ్య అన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తరపున గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే పల్లా గెలుపొందాలని జనగామ మాజీ ఎంపీపీ బైరగోని యాదగిరిగౌడ్, ఎర్రగొల్లపహడ్ గ్రామస్తులు కొడవతూర్‌లోని సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసి ముడుపు కట్టారు.

విజయవంతం చేయాలి

దేవరుప్పుల: ఈ నెల 11న హైదరాబాద్‌లో ఎస్సీ సామాజిక వర్గ అభ్యున్నతి కోసం తలపెట్టిన విశ్వరూప మహాసభకు రాజకీయాలకతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ, పెద్ద మడూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. యాదగిరి, రాములు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేస్తా..

స్టేషన్‌ఘన్‌పూర్: తొమ్మిది సంవత్సరాల క్రితం భారతీయ జనతా పార్టీలో చేరానని, ఎవరు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా బెదిరేది లేదని, పార్టీలోనే కొనసాగుతూ అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. డివిజన్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 నుంచి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నానని, 2018 ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేశానన్నారు. తనకు టికెట్ వస్తుందని ఆశిస్తే ఏనాడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనని డాక్టర్ విజయరామారావుకు అందించారని ఆవేదన చెందారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు బీజేపీ కోసం పనిచేస్తానన్నారు.

నివాళి

దేవరుప్పుల: సింగరాజుపల్లిలో మేకపోతుల కౌలస్య ఇటీవల మృతి చెందింది. కాగా, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు గ్రామానికి చేరుకొని కౌసల్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులైన బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సీనియర్ నాయకుడు ఆంజనేయులు, రవీందర్, గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లును పరామర్శించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్–3 ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు సింగపురం దయాకర్ తో పాటు 20 మంది బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా తాటికొండకు చెందిన 30 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

కొడకండ్ల: పెద్దబాయితండా సర్పంచ్ వాంకుడోత్ సునీతరమేష్ బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. సర్పంచ్‌తో పాటు అంజయ్య, సురేష్, రేగుల గ్రామానికి చెందిన పాలకుర్తి దేవస్థాన డైరెక్టర్ కల్సాని ఉప్పల్‌రెడ్డి, రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోమల్లు తదితరులు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దేవరుప్పుల: మండలంలోని సీతారాంపురం, పెద్ద మడూరుకు చెందిన సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, మాజీ సర్పంచ్ బోనగిరి నర్సింహ్మ, పీఏసీఎస్ డైరెక్టర్ ఆకవరం రవీందర్‌రెడ్డి, ధరావత్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు సావిత్రి, లక్ష్మణ్ నేతృత్వంలో అధిక సంఖ్యలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

కేసీఆర్ కథలు నమ్మేస్థితిలో జనం లేరు



మహిళలకు దండంపెడుతూ ఓట్లు అడుగుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



శామీర్‌పేటలో కొమ్మూరి భారీ ర్యాలీ

- కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు నమ్ముతున్నారు
- అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది
- పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి, భువనగిరి పార్లమెంట్ అబ్జర్వర్ శ్రీనివాస్

జనగామ/జనగామ రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చెప్పే కథలు.. బీఆర్‌ఎస్ నాయకుల మాయ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అన్ని వర్గాల ప్రజలు బలంగా నమ్ముతున్నారని ఆ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అబ్జర్వర్ మన్నె శ్రీనివాస్ పేర్కొన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్, శామీర్‌పేట, పసరమడ్ల, ఓబుల్ కేశ్వాపూర్‌తో పాటు జనగామ పట్టణంలోని పలు వార్డుల్లో వారు బుధవారం గడప గడపకూ ప్రచారం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో రెండు దఫాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పదేళ్లలో చేయని అభివృద్ధి.. మూడోసారి గెలిపిస్తే చేస్తామనడం ఆ పార్టీ అవివేకానికి నిదర్శనమన్నారు. దళితులకు మూడెకరాల భూమి, ఉచిత ఎరువులు, కేజీ టు పీజీ విద్య, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతులకు వందశాతం రుణమాఫీ, పంట నష్టపరిహారం.. ఇలా కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలి పోయాయన్నారు. 2018 ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఆ తర్వాత యువతను నట్టేట ముంచాడని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసి పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు తూట్లు పొడిచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను చూసి బీఆర్‌ఎస్ పార్టీ, నాయకుల్లో దడ పుడుతోందని, ఓటమి భయంతో ప్రజలను మభ్యపెడుతూ తప్పుడు ప్రచారాలకు తెరలేపుతున్నారని పేర్కొన్నారు.

అధికారం కాంగ్రెస్‌దే..

రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టబోతున్నారు.. అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని కొమ్మూరి పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనతో విసుగు చెందిన జనం ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని, మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని అధికారంలోకి రాగానే అమలు చేస్తామని చెప్పారు. ఇందులో ఎటువంటి అపోహలకు తావు లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఆశీర్వదిస్తే జనగామ నియోజకవర్గాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తామని వివరించారు. ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తామని ఇందుకు అన్ని వర్గాల సహకారం తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రం, మున్సిపాలిటీని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, బీఆర్‌ఎస్ మాయ మాటలు వినకుండా చేయి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారం సందర్భంగా అన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలు కొమ్మూరికి బోనాలు, కోలాటం, మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు సర్వవల నరసింగరావు, చిర్ర సత్యనారాయణరెడ్డి, ధర్మ గోవర్ధన్ రెడ్డి, కొత్త కరుణాకర్‌రెడ్డి, శివరాజ్ యాదవ్, గనిపాక మహేందర్, రాజు, సిద్ధయ్య గౌడ్, బాలరాజు గౌడ్, నర్సిరెడ్డి, కృష్ణస్వామి, కట్ట కృష్ణ, శేఖర్, ఆలేటి సిద్ధి రాములు, కామిని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో కొమ్మూరికి స్వాగతం పలుకుతున్న మహిళలు

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ యశ్వంతాపురంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యాన గడప గడపకు ప్రచారం చేపట్టారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ చేయి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, కౌన్సిలర్ వంగాల కల్యాణి, మండల అధ్యక్షురాలు కాములు జయ, మునిబేగం, సుజాత పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య



రాకేష్ (ఫైల్)

బచ్చన్నపేట: బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బచ్చన్నపేట మండలం కట్కూర్‌కు చెందిన టేకులపల్లి సిద్దులు బతుకుదెరువు కోసం హైదరాబాద్ మౌలాలి వెళ్లి అక్కడే ఉంటూ జీవనం సాగిస్తూ స్థిరపడ్డారు. సిద్దులుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు టేకులపల్లి రాకేష్(21) మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాకేష్ బుధవారం మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

తరిగొప్పుల: వరకట్న వేధింపులు తాళలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా ఆందోల్ గ్రామానికి చెందిన దివిటి అనితా రాజు దంపతుల కుమార్తె దివిటి రేణుక(19) సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సింగ్ కోర్సు చేస్తుంది. కాగా, తరిగొప్పుల మండలకేంద్రం శివారు నర్సింగాపూర్ గ్రామానికి చెందిన అమిరిశెట్టి పరమేశ్వరీ సత్తయ్య దంపతుల కుమారుడు రాకేష్‌తో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. వీరి ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాలకు తెలియడంతో కట్నకానుకలతో ఈ ఏడాది జూన్ నెలలో వివాహం జరిపించారు. దాంపత్యం కొన్ని రోజులు సాఫీగా సాగింది. గత కొన్ని రోజులుగా రాకేష్ పనిచేయకుండా జులాయిగా తిరుగుతూ ఇంటి వద్దే ఉంటూ మద్యం తాగుతూ ఉండసాగాడు. పని ఎందుకు చేయడం లేదని భార్య నిలదీసింది. ఈ క్రమంలో పెళ్లి సమయంలో కట్నం తీసుకురాలేదని రేణుకను రాకేష్ వేధించసాగాడు. దీంతో వరకట్న వేధింపులు తాళలేక రేణుక అక్టోబర్ 30వ తేదీన గడ్డిమంది తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలి తల్లి అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొడవటూరు వద్ద ఆలేరు వాసి మృతి



ప్రకాష్ మృతదేహం

బచ్చన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలానికి చెందిన వ్యక్తి మండలంలోని కొడవటూర్ కెనాల్ వద్ద మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై కంకల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం ... కొడవటూర్ నుంచి బచ్చన్నపేటకు వెళ్లే దారిలో ఆలింపూర్ క్రాస్‌రోడ్డు వద్ద గోదావరి కెనాల్ మోరీ కింద శవం ఉండడాన్ని గమనించారు. ఈ విషయాన్ని గ్రామస్తుల సమాచారం అందించగా ఘటనా స్థలం వద్దకు పోలీసులు చేరుకున్నారు. శవాన్ని పరిశీలించి బయటకు తీశారు. మృతుడు చనిపోయిన ప్రదేశంలో మద్యం తాగిన సీసాలు, గ్లాసులు ఉన్నాయని అతని మొహంపై చెట్ల ఆకులు వేసి ఉన్నాయన్నారు. పలుచోట్ల గాయాలున్నాయని పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం గదిలో భద్రపర్చామన్నారు. ఎస్సై సతీష్ కేసు వివరాలను సేకరించగా మృతుడు దివ్యాంగుడు మైలారం ప్రకాష్ (40)గా ఆలేరులో నివాసముంటున్నట్లు కనుగొన్నారు. అతనిది ఆలేరు మండలంలోని కొల్లూరు స్వగ్రామం, బాలమణితో గత 20 ఏళ్ల క్రితం వివాహం కాగా భార్యతో కలిసి ఆలేరులో నివాసముంటున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఐదు నెలలుగా భార్యతో గొడవపడి విడిగా ఉంటున్నాడని తెలిపారు. కేసు పూర్వాపరాలను సేకరిస్తున్నామని వివరించారు. ప్రకాష్ ఆలేరులో వాటర్ ప్లాంటు, టెంట్‌హౌజ్‌లలో పని చేసేవాడని తెలిపారు. ఘటనా స్థలానికి ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నర్మెట సీఐ సాయిరమణ వచ్చి పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రూపా చైతన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీసీఐ పత్తి కొనుగోలు ప్రారంభం

చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని చిల్పూరు మండలం రాజవరంలోని సిరి కాటన్ ఇండస్ట్రీలో బుధవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో రైతుల నుంచి పత్తి కొనుగోలును మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిని అమ్మకానికి తెచ్చే రైతులు మద్దతు ధర పొందేందుకు ఆధార్ అనుసంధానం తప్పని సరి చేసుకోవాలని అన్నారు. దీంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం వెంట తెచ్చుకోవాలని చెప్పారు. అనంతరం రైతులకు తక్ పట్టీలను జారీ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ సెంటర్ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి, మిల్ యజమానులు సంతోష్, వెంకన్న, కౌశిక్, ఏయంసీ సిబ్బంది శ్రీనివాస్, డేవిడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు చేస్తున్న సీసీఐ అధికారులు